మున్సిపల్ బడ్జెట్‌పై అడిషనల్ కలెక్టర్ సమీక్ష

షాద్‌నగర్‌టౌన్, జనవరి 27 : 2024-25 సంవత్సరానికి సంబంధించిన షాద్‌నగర్ మున్సిపల్ బడ్జెట్‌పై అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ శనివారం మున్సిపల్ కార్యాలయంలోని అధికారులతో సమీక్ష నిర్వహించారు. బడ్జెట్‌కు సంబంధించిన పలు విషయాలపై సంబంధిత అధికారులతో చర్చించడంతో పాటు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతిమాసింగ్‌కు మున్సిపల్ కమిషనర్ వెంకన్న మొక్కను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్, అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్‌పై అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

వరినాట్ల పరిశీలన

బొంరాస్‌పేట, జనవరి 27 : దుద్యాల మండలం నాస్కంపల్లి గ్రామంలో వరినాట్లను జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ శనివారం పరిశీలించారు. వరి పంట సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వాడకం గురించి సూచనలు, సలహాలు అందించారు. యాసంగిలో వరి పంటలకు జింక్ ధాతు లోపం ఎక్కువగా ఉంటుందని.. దీనిని నివారించడానికి పొలంలో ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్‌ను భాస్వరం ఎరువులతో కలువకుండా దుక్కిలో వేసుకోవాలని రైతులకు సూచించారు. యాసంగిలో వరిలో ఎకరానికి 20 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 15 కిలోల మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను ఆఖరి దుక్కిలో వేయాలని డీఏవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో హేమ, సర్పంచ్ శకనప్ప, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, కాశప్ప, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

వరినాట్లను పరిశీలిస్తున్న డీఏవో గోపాల్

బొంరాస్‌పేట : మండలంలోని లింగన్‌పల్లి, కొత్తూరు గ్రామాల సర్పంచ్‌లు బడెంపల్లి కాశప్ప, మహేందర్ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. సీఎంను సన్మానించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లోని సమస్యలు సీఎంకు తెలిపి అభివృద్ధికి నిధులివ్వాలని వారు కోరారు.

పెంచుకున్న జ్ఞానాన్ని పంచడం నేర్చుకోవాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

మొయినాబాద్, జనవరి 27 : విద్యార్థులు నేర్చుకున్న జ్ఞానాన్ని ఇతరులకు పంచితే వివేకవంతులవుతారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. మండలపరిధిలోని హిమాయత్‌నగర్ ఎన్‌టీఆర్ మోడల్ విద్యా సంస్థ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతక్కను ఎన్‌టీఆర్ ట్రస్ట్ చైర్మన్ భువనేశ్వరి ఆమెను సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

ముగిసిన నేచర్ క్యాంపు

షాబాద్, జనవరి 27 : తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎకో టూరిజం కార్యక్రమాల్లో భాగంగా చిల్కూర్ ఫారెస్ట్ ట్రెక్ పార్క్‌లో నూతనంగా నేచర్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో హైదరాబాద్ నలుమూలల నుంచి 20 మంది పాల్గొన్నారు. ఈ నెల 26న మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమైన క్యాంపు 27న ఉదయం 11:30గంటలకు ముగిసింది. క్యాంపును బుకింగ్ చేసుకున్న వారందరూ రైన్ ట్రీ రచ్చబండ వద్ద హాజరు కాగా.. వారికి ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ కల్యాణపు సుమన్ నేచర్ క్యాంపు, జరుగబోయే కార్యక్రమాల గురించి వారికి వివరించారు. నేచర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ పాల్గొని క్యాంపు ఎలా అనిపించిందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ప్రకృతి పర్యాటకానికి పెద్దపీట వేసి(మద్యం నిషేధిత) నేచర్ క్యాంపులను ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, నేచురలిస్ట్‌లు శ్రీకాంత్, భాస్కర్, టీఎస్ఎఫ్‌డీసీ సిబ్బంది ఉన్నారు.

నేచర్ క్యాంపులో పాల్గొన్న ప్రజలు

అదనంగా 18 కిలోమీటర్ల పైపులైన్

జలమండలి ఎండీని కలిసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, జనవరి 27: ఎల్బీనగర్ నియోజకవర్గంలో నూతన తాగునీటి పైపులైన్ నిర్మాణం కోసం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శనివారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఎల్బీనగర్ నియోజకవర్గంలో 80 కిలోమీటర్ల మేర నూతన వాటర్‌లైన్లు మంజూరు చేయడం జరిగిందని, దానికి అదనంగా మరో 18 కిలోమీటర్ల వాటర్ లైన్ మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గంలోని శివారు కాలనీల్లో నూతనంగా యూజీడీ లైన్లు వేసేందుకు రూ.40 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయంపై జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని కలిసి చర్చిస్తున్న సుధీర్‌రెడ్డి

శేరిగూడ శ్రీఇందు కళాశాల సమీపంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణ పనులు

- రూ.3 కోట్లను కేటాయించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం
- బిల్లులు రాలేదని పనులను నిలిపివేసిన కాంట్రాక్టర్
- పనులు పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని ప్రజల వినతి
- తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడంలేదని వాహనదారుల ఆరోపణ

కొనసాగని కల్వర్టు పనులు తప్పని తిప్పలు

ఇబ్రహీంపట్నం, జనవరి 27 : హైదరాబాద్-నాగార్జునసాగర్ ప్రధాన రహదారిలోని శేరిగూడ సమీపంలో శ్రీఇందు కళాశాల వద్ద నిర్మిస్తున్న వంతెన నిర్మాణం పనులు ముందుకు సాగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే నాగార్జునసాగర్ ప్రధాన రహదారిలోని శేరిగూడ సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులకు గత ప్రభుత్వం రూ.3 కోట్లు కేటాయించింది. గతంలో కురిసిన వర్షాల వల్ల ఇబ్రహీంపట్నం పెద్దచెరువు అలుగు పారడం వల్ల ఈ కల్వర్టు పూర్తిగా నీటమునిగి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనిని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఈ ప్రాంతంలో భారీ వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో ఒకవైపు మాత్రమే కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండో వైపు నుంచి వాహనాల దారి మళ్లింపు కోసం వదిలిపెట్టారు. ఒకవైపు పూర్తయినప్పటికీ బిల్లులు రాలేదన్న నెపంతో కాంట్రాక్టర్ రెండోవైపు పనులు నిలిపివేశాడు. దీంతో ఆరు నెలలుగా కల్వర్టు నిర్మాణ పనులు ముందుకు సాగకపోవడంతో ఈ రహదారిలో వెళ్లే వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం, సాయంత్రం ఇంజినీరింగ్ కళాశాలల బస్సులతో నిత్యం రద్దీగా ఉండే నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారి శేరిగూడ సమీపంలో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. ముఖ్యంగా రాత్రిపూట ఈ కల్వర్టు వద్ద కొత్తగా వచ్చే వాహనదారులు రోడ్డును గుర్తించలేక తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలని ఇప్పటికే బీజేపీ ఆధ్వర్యంలో ఈ కల్వర్టు వద్ద పెద్దఎత్తున ఆందోళన కూడా చేపట్టారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టకపోయినా బాగుండేదని, చేపట్టి మధ్యలో వదిలివేయడం వలన తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాహనదారులు, ప్రజలు వాపోతున్నారు.

వంతెన నిర్మాణ పనులు వెంటనే పూర్తిచేయాలి

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణ పనులకు నిధులు కేటాయించడంతో పాటు వంతెన నిర్మాణం కూడా ఒకవైపు చేపట్టేందుకు కృషిచేసింది. మిగతా వంతెన నిర్మాణ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ పూర్తిచేయకపోవడంతో ప్రయాణికులు పూర్తిగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో రోడ్డు ప్రమాదాలు పెద్దఎత్తున జరిగి ఇబ్బందులు పడుతున్నందున.. వెంటనే వంతెన నిర్మాణ పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలి.

- అల్వాల వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు

రోజూ ఇబ్బంది పడుతున్నాం

నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై అర్ధాంతరంగా నిలిచిపోయిన వంతె నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ రోడ్డుపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి రోడ్డు పనులు చేసేందుకు కృషిచేయాలి.

- పరమేశ్, ప్రయాణికుడు

వేణునాదంతో మైమరపించిన విద్యార్థులు

వికారాబాద్, జనవరి 27 : వేణునాదంతో పూడూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి సభికులను అబ్బురపరిచారు. గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు చేయగా, పూడూరు మండలం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 9వ తరతగతి చదువుతున్న వజ్ర నిర్దోష, 7వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.మురా మురళీ గానంతో సభికులను మైమరపించారు. వజ్ర నిర్దోష గణపతి పాటతో కార్యక్రమాన్ని ప్రారంభించగా, మురారి జాతీయ గీతాన్ని వేణునాదంతో ఆలపించి ముగించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ఆయా రంగాల్లో విద్యార్థులు రాణించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మురారి, వజ్ర నిర్దోషలకు పిల్లన గ్రోవిలో తర్ఫీదునిచ్చిన ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను అభినందించారు. అనంతరం విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, డీఆర్డీవో కృష్ణన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ఏడీ రాంరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, పశుసంవర్ధక శాఖ అధికారి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి మురారికి జ్ఞాపికను అందజేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సహాయ సహకారాలు అందిస్తాం

జిల్లా ఉద్యానశాఖ అధికారి చక్రపాణి

చక్రపాణితో జాగృతి బృందం సభ్యులు

బొంరాస్‌పేట, జనవరి 27 : జాగృతి, జీకేఎఫ్ బృందం జిల్లా ఉద్యానశాఖ అధికారి చక్రపాణిని శనివారం జిల్లా కేంద్రంలో కలిశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో దీర్ఘకాలిక పంటలైన పండ్లు, అటవీజాతి మొక్కలను సాగు చేస్తున్న రైతులకు పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఐక్యరాజ్య సమితి ఇస్తున్న కార్బన్ క్రెడిట్స్ నగదు ప్రోత్సాహకాల గురించి ఈ బృందం సభ్యులు చక్రపాణికి వివరించారు. జీకేఎఫ్ అగ్రి ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల రైతులకు ఈ ప్రోత్సాహం అందిస్తున్నామని వారు తెలిపారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తమ సహాయ సహకారాలు కూడా అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జాగృతి సంస్థ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, కోఆర్డినేటర్లు జగ్గప్ప, మురళి, సంగమేశ్వర్‌గౌడ్, ఎల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితేనే

అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు

ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి

ఇబ్రహీంపట్నం, జనవరి 27 : ఏకాగ్రతతో చదివితేనే అనుకున్న లక్ష్యాలను చేరుకుంటారని ఇబ్రహీంపట్నం సీనియర్ సివిల్ జడ్జి శంకర్ శ్రీదేవి అన్నారు. శనివారం ఇబ్రహీంపట్నం సమీపంలోని కస్తూర్బా పాఠశాలలో నేషనల్ గర్ల్స్ చైల్డ్ డే సందర్భంగా బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు ఆపద వచ్చినప్పుడు ఏ పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. చిన్నచిన్న విషయాలకు గొడవపడి కోర్టు చుట్టూ తిరిగి డబ్బు, సమయాన్ని వృథా చేసుకోవద్దని సూచించారు. బాల్య వివాహాలు, సైబర్ మోసాలపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో.. కల్వర్టులో పడి..

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 27: ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కల్వర్టులో పడి మృతి చెందాడు. ఈ ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన జగన్ (35) కుటుంబసభ్యులతో కలిసి బాబు ల్‌రెడ్డినగర్‌లో ఉంటున్నాడు. స్థానికంగా ఓ వైన్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 24న విధులు ముగించుకొని అక్కడే మద్యం తాగాడు. వైన్స్ షాపు పక్కనే నిద్రపోయాడు. ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న కల్వర్టులో పడి చనిపోయాడు. పోలీసులు జగన్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్‌లో మోసం

- జనరేటర్ కొనబోయి రూ.లక్షా60 వేలు కోల్పోయిన యువకులు శ్రీను, ప్రవీణ్‌కుమార్
- మారేపల్లితండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- సైబర్ క్రైమ్ టోల్‌ఫ్రీ నం.1930 ద్వారా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రవీణ్‌కుమార్
- వివరాలు వెల్లడించిన పెద్దేముల్ ఎస్ఐ కాశీనాథ్

పెద్దేముల్, జనవరి 27 : ఆన్‌లైన్‌లో ఫేస్‌బుక్ ద్వారా ఒక పెద్ద జనరేటర్ కొనే ప్రయత్నంలో ఇద్దరు యువకులు రూ.లక్షా60వేలను మోసపోయిన ఘటన పెద్దేముల్ పోలీసు స్టేషన్ పరిధిలోని మారేపల్లితండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ ఎం.కాశీనాథ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని మారేపల్లితండాకు చెందిన బి.ప్రవీణ్‌కుమార్, మన్సాన్‌పల్లితండాకు చెందిన శ్రీను ఇరువురు మంచి స్నేహితులు. నెలరోజుల క్రితం శ్రీను రూ.22 లక్షలతో ఓ డీజేను కొన్నాడు. డీజేను ఆర్డర్‌లపై నడపడానికి ఓ పెద్ద జనరేటర్ అవసరమని భావించి ఫేస్‌బుక్ చూస్తుండగా అందులో రూ.లక్షా90వేలకు జనరేటర్ పుణెలో లభిస్తుందని నిర్ధారించుకొని ఆన్‌లైన్‌లో ఇచ్చిన నం.9832264197కు కాల్ చేశారు. జనరేటర్ మొత్తానికి రూ.లక్షా80వేలకు ఇరువురు బేరం కుదుర్చుకున్నారు. రేటు కుదరగా సదరు వ్యక్తి మొదటగా రూ.5వేలు, తదుపరి 10వేలు, 20వేలు, 10వేలు, 23వేలు, 18వేలు, 10వేలు, 30వేలు ఇలా పలుమార్లు మొత్తం రూ.లక్షా60వేలను ఈ నెల 18 వరకు పుణెకు చెందిన మనీష్ రమాకాంత్ దుర్వే పేరిటి ఉన్న ఫోన్‌పే, గూగుల్ పేల ద్వారా ఇరువురి నుంచి వేయించుకున్నాడు. శ్రీను, ప్రవీణ్‌లకు జనరేటర్ ఓ ప్రైవేట్ వాహనంలో పంపిస్తున్నానని, వాహనం బయలుదేరిందని, రెండు రోజుల్లో మీ వద్దకు వస్తుందని మాయమాటలు చెప్పాడు. ఈ నెల 20న పుణెలో సదరు వ్యక్తి పంపిన అడ్రస్‌లో శ్రీను, ప్రవీణ్ సమీప బంధువుల ద్వారా ఎంక్వై రీ చేయించగా అక్కడ జనరేటర్ షాపు లేదు, జనరేటర్ లేదు, కేవలం రింగ్ రోడ్డు మాత్రమే ఉందని బంధువులు నిర్ధారించారు.

ఇదిలా ఉండగా మనీష్ రమాకాంత్ దుర్వేకు ఫోన్ చేయగా మిగతా డబ్బులు పంపించండి.. జనరేటర్‌ను పంపిస్తా.. వద్దంటే మీ డబ్బులు మీకు ఇస్తానని తెలిపాడు. ఈ నెల 26న మిగిలిన రూ.20వేలు వేయాలన్నాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన యువకులు.. మారేపల్లి సర్పంచ్ పాండునాయక్‌కు తెలిపారు. ఆయన స్థానిక పోలీసుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. తదుపరి ప్రవీణ్‌కుమార్ సైబర్ క్రైమ్ 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారని.. ఆన్‌లైన్‌లో సైబర్ క్రైమ్ కింద అక్నాలెడ్జ్‌మెంట్ నం. 33701240003346 ప్రకారం సైబర్ క్రైమ్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారని ఎస్ఐ కాశీనాథ్ తెలిపారు.

వాడివేడిగా మహేశ్వరం సమావేశం

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జనవరి 27: మహేశ్వరం సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. మహేశ్వరం ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎజెండాలో ఉన్న 23 అంశాలపై చర్చించారు. రైతుల బావుల వద్ద గడ్డి కటింగ్ యంత్రాలు ఉండటంతో అధికారులు మీటర్లు పెట్టుకోవాలని సూచించడంతో సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో రైతులకు ఇచ్చిన విధంగానే కరెంటు ఇవ్వాలని సభ్యులు పట్టుబట్టారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొన్నది. రోజుకు నాలుగు గంటలు కరెంటు పోతున్నదని.. సాయంత్రం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు సింగిల్ ఫేజ్ కరెంటు వస్తున్నదని అధికారులపై ఆరోపించారు. గడ్డి కటింగ్ చేసుకోవడానికి కమర్షియల్ మీటర్లు పెట్టుకోవాలని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. గతంలో మహేశ్వరం మండలవ్యాప్తంగా మీటర్లు లేకుండా ఇటుక బట్టీలు నడుస్తుంటే ఎందుకు మీటర్లు పెట్టలేదని అధికారులను సభ్యులు నిలదీశారు.

మహేశ్వరం సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి

ప్రభుత్వ భూములు కాపాడాలి

ప్రభుత్వ భూములు కబ్జా అవుతుంటే ఎందుకు పట్టించుకోవడం లేదని తహసీల్దార్ మహమూద్‌అలీపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ప్రభుత్వ భూముల నుంచి ఇష్టానుసారంగా మట్టి తరలిస్తుంటే అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారన్నారు. పీవోటీ కింద భూములను తీసుకోవాలన్నారు. చెరువు కుంటలు అన్యాక్రాంతం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను సర్వే చేయించాలన్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సరిహద్దులను గుర్తించి ఎఫ్‌టీఎల్‌ను ఫిక్స్ చేయాలన్నారు. కబ్జాదారులు ఎంతటివారైనా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆరు గ్యారెంటీల అమలెప్పుడో..

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని.. ఆ గ్యారెంటీలకే గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. వారం రోజుల పాటు ప్రజలను క్యూ లైన్లలో నిలబెట్టి తీసుకున్న దరఖాస్తులు ఎక్కడ వేశారో తెలియదన్నారు. ఆరు గ్యారెంటీలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన అధికారులు రేషన్ కార్డు దరఖాస్తులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అందుకు తహసీల్దార్ స్పందిస్తూ ప్రభుత్వం నుంచి రేషన్ కార్డుల కోసం గైడ్‌లైన్స్ రాలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎండీవో నర్సింహ, ఎంఈవో కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తనిఖీల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న పౌర సరఫరాల అధికారులు

పక్కదారి పడుతున్న డొమెస్టిక్

నగరవ్యాప్తంగా తనిఖీలు.. 230 గృహావసర సిలిండర్లు సీజ్ 134 మందిపై కేసులు

సిటీబ్యూరో, జనవరి 27 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో గృహ అవసరాల కోసం ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తున్న గ్యాస్ సిలిండర్లు పక్కదారి పడుతున్నాయి. కొందరు గ్యాస్ ఏజెన్సీల సహాయంతో కమర్షియల్ సిలిండర్లు వాడాల్సిన చోట డొమెస్టిక్ వాడుతున్నట్లు శనివారం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో గుర్తించారు. ఈ క్రమంలో జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని హోటళ్లు, హాస్టళ్లతో పాటు పలు వ్యాపార సముదాయాల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మొత్తం 230 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు అక్రమంగా వాడుతున్నట్లు గుర్తించి, వాటిని సీజ్ చేశామని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రమేశ్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 134 మందిపై కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

తండ్రిని చంపిన తనయుడు

అడ్డువచ్చిన మామను సైతం..

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 27: కుటుంబ కలహాలతో కన్నకొడుకు తండ్రిని అతికిరాతకంగా చంపేశాడు. అడ్డువచ్చిన మామను సైతం కడతేర్చాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీనారాయణ(55) తన కటుంబంతో కలిసి రాజేంద్రనగర్ సర్కిల్ బాబుల్‌రెడ్డినగర్‌లో నివాసముంటున్నాడు. ఇతడి కుమారుడు రాకేశ్(24) డ్రైవింగ్ చేస్తుంటాడు. లక్ష్మీనారాయణ తన ఇంటిని అమ్మకానికి పెట్టాడు. ఇంటిని కొనేందుకు ఓ పార్టీ వచ్చి టోకెన్ డబ్బులు ఇచ్చింది. అప్పటి నుంచి ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం మరోసారి గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహంతో రాకేశ్.. తండ్రి లక్ష్మీనారాయణపై ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. ఆపేందుకు ప్రయత్నించిన మామ శ్రీనివాస్(60)పై దాడికి దిగాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారొచ్చి.. తీవ్రంగా గాయపడిన లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వారిద్దరూ చనిపోయారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.